సాక్షి మంచిర్యాల

బుధవారం, 20, మార్చి, 2024



కుడుక అను'బంధం'

ఆదివాసీ గూడేలు హోలీ(దురాడి) పండుగకు సిద్ధమవుతున్నాయి. గ్రామస్తులు ఊరిలో లెక్కలో ఉండాలంటే కాముడి దహనం రోజు గ్రామ పెద్దలకు కుడుక ఇవ్వాల్సిందే. 8లో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ: 6:28	గురు: 4:57

గరిష్టం/కనిష్టం
35.0 /21.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి.

న్యూస్‌రీల్

మామిడిగూడకు మంచినీరు



మిషన్ భగీరథ నల్లా ద్వారా వస్తున్న నీరు

సాక్షి ఎఫెక్ట్

భీమిని: 'చెలిమె నీరే ఆధారం' శీర్షికన 'సాక్షి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని మామిడిగూడ గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయమై ప్రచురించగా.. మంచినీరు అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. భీమిని ఎంపీవో, బెల్లంపల్లి ఇన్‌చార్జి డీఎల్‌పీవో సఫ్దర్‌అలీ ఆదేశాలతో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు మంగళవారం మామిడిగూడలోని మిషన్ భగీరథ నీటి పైపులైన్ మరమ్మతులు చేపట్టారు. నీరందేలా చర్యలు తీసుకున్నారు. దూర ప్రాంతం నుంచి మంచినీరు తెచ్చుకోలేక ఇబ్బంది పడుతున్న గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

పదో తరగతి పరీక్షలకు 99.77శాతం హాజరు




క్రిష్ణవేణి హైస్కూల్‌లో పరిశీలిస్తున్న కలెక్టర్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో పదో తరగతి సెకండ్ లాంగ్వేజ్(తెలుగు, హిందీ, ఉర్దూ) పరీక్ష మంగళవారం నిర్వహించగా 99.77 శాతం విద్యార్థులు హాజరయ్యారు. 51 కేంద్రాల్లో రెగ్యులర్ విద్యార్థులు 9,294మంది విద్యార్థులకు గాను 9,273 మంది హాజరు కాగా 21 మంది గైర్హాజరయ్యారు. జిల్లా కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ సందర్శించారు. డీఈవో యాదయ్య చెన్నూర్‌తోపాటు పలు పరీక్ష కేంద్రాలను సందర్శించినట్లు కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్ దామోదర్‌రావు తెలిపారు.

మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు

తాండూర్: పదో తరగతి పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్ అధికారులకు సూచించారు. మంగళవారం మండలంలోని పదవ తరగతి పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. విద్యార్థులకు పరీక్ష కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూడాలని, జిరాక్స్ సెంటర్లను మూసి వేయించడంతోపాటు పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని అన్నారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులు అందుబాటులో ఉంచాలని తెలిపారు. అనంతరం మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. గ్రంథాలయాన్ని పరిశీలించి సమస్యలు తెలుసుకున్నారు. పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలు, మెటీరియల్ కొనుగోలు చేయాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

సనాతన ధర్మాన్ని ఆచరించాలి



విగ్రహాలకు పీఠాధిపతి పంచాభిషేకం

నెన్నెల: ప్రతి ఒక్కరూ సనాతన ధర్మాన్ని ఆచరించడం ద్వారా ఎలాంటి ప్రకృతి విపత్తులు, రోగాల బారిన పడకుండా లోకమంతా సుభిక్షంగా ఉంటుందని శృంగేరి శివగంగాపీఠాధిపతి పురుషోత్తమన భారతి మహాస్వామి అన్నారు. మండల కేంద్రంలోని గంగాధర దేవాలయం(శివాలయం) దేవతామూర్తులకు పవిత్ర గంగాజలాలతో అభిషేకం చేసి 20మంది వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య ప్రాణప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదశాస్త్రాల్లోని సనాతన ధర్మాన్ని ఆచరిస్తే విశ్వమంతా ఆరోగ్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, వివిధ గ్రామాల ప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

రూ.30 లక్షలతో పునర్నిర్మాణం

భక్తులు, దాతలు కలిసి శివాలయాన్ని రూ.30 లక్షలు చందాలు పోగు చేసి పునర్నిర్మించారు. పాత శివాలయం శిథిలావస్థకు చేరగా పునర్నిర్మాణం చేపట్టారు. కొందరు భక్తులు విగ్రహాలు, ధ్వజస్తంభాలు, ఇతర సామగ్రి స్వచ్ఛందంగా అందించారు.

కేబీఎంకు ఎదురుదెబ్బ!

- గడ్చిరోలి ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతి
- మృతుల్లో ఇద్దరు తూర్పు జిల్లా పరిధి కమిటీ వారే..
- పట్టుకోల్పోతున్న కుమురంభీం మంచిర్యాల కమిటీ



వర్గీశ్ (ఫైల్)

మృతుల ఫైల్ ఫొటోలు

తిర్యాణి మండలం గుండాలలో పోలీసుల కూంబింగ్(ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: లోక్‌సభ ఎన్నికల ముందు మావోయిస్టు పార్టీ కేబీఎం(కుమురంభీం మంచిర్యాల) కమిటీకి కోలుకోలేని 'ఎదురు'దెబ్బ తగిలింది. మంగళవారం తెల్లవారుజామున మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లా అహెరి తాలూకా కొలమార్క కొండలకు ఐదు కిలోమీటర్ల దూరంలో రేపన్‌పల్లి శివారు అడవుల్లో అదనపు ఎస్పీ యతీశ్ దేశ్‌ముఖ్ నేతృత్వంలో సీ60, సీఆర్‌పీఎఫ్ క్యూఏటీ(క్విక్ యాక్షన్ టీం), మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో మంచిర్యాల కుమురంభీం(కేబీఎం) కమిటీ సభ్యుడు, డివిజనల్ కమిటీ మెంబర్ (డీవీసీఎం) మంగి ఇంద్రవెల్లి ఏరియా కమిటీ కార్యదర్శిగా ఉన్న వర్గీశ్ కోయ అలియాస్ మంగులు, డీవీసీఎం, సిర్పూర్-చెన్నూరు ఏరియా కమిటీ కార్యదర్శి మంగ్తూ, ఇద్దరు ప్లాటూన్ సభ్యులు కుర్సాంగ్ రాజు, కుడిమెత వెంకటేశ్ చనిపోయినట్లుగా గుర్తించారు. ఇంకా బలగాల ఆపరేషన్ కొనసాగుతోంది. వీరిపై రూ.36లక్షల రివార్డు ఉంది.

పట్టు కోసం ప్రయత్నాలు..

కేబీఎం కమిటీని బలోపేతం చేయాలని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు మైలారపు అడెల్లు అలియాస్ భాస్కర్ కొన్నేళ్లుగా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాడు. ఆ క్రమంలో తొలిసారిగా 2013లో ఇంద్రవెల్లి మండలం వాయిగూడ క్యాంపులో ఉన్నప్పుడు అడెల్లు పోలీసుల కళ్లుగప్పి తృటిలో తప్పించుకున్నాడు. కొన్నాళ్లు దండకారణ్యానికే పరిమితం అయ్యాడు. 2016లో తిర్యాణి మండలం మంగీ దళ కమాండర్ ఆత్రం శోభన్ అలియాస్ చార్లెస్ ఛత్తీస్‌గఢ్‌లో చనిపోవడంతో ఈ దళం క్రమంగా క్రియాశీలతను కోల్పోయింది. కేబీఎంగా రూపాంతరం చెందాక అడెల్లు ప్రాతినిధ్యం వహిస్తూ మరింత పట్టు పెంచుకునే పనిలో పడ్డారు. ఉమ్మడి జిల్లా బోథ్ మండలం పొచ్చెరకు చెందిన అడెల్లుకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉంది. పాత పరిచయాలు, సానుభూతిపరులతో 2020లో గిరిజన, ఆదివాసీ యువతను నియమాకం చేసుకునేందుకు ప్రయత్నించి వీలుగాక తిరిగి వెళ్లిపోయారు. ఆ ఏడాది జూలైలో మంగీ, గుండాలలో దళ సంచారం ఉందనే సమాచారంలో విస్తృతంగా కూంబింగ్ చేశారు. అదే ఏడాది సెప్టెంబర్‌లో గ్రేహౌండ్స్ బలగాలు కాగజ్‌నగర్ మండలం కదంబా అడవుల్లో జరిపిన కాల్పుల్లో ఛత్తీస్‌గఢ్‌కు చెందిన కేబీఎం కమిటీ యాక్షన్ టీం సభ్యుడు ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చుక్కాలు, మరొకరు చనిపోయారు. 2022 డిసెంబర్‌లో అడెల్లు సహచరి, నిర్మల్ జిల్లా కడెం పెద్దూర్ మండలం లక్ష్మీసాగర్ చెందిన కంతి లింగవ్వ, అలియాస్ అనిత కేబీఎం అసిస్టెంట్ కమాండర్‌గా పని చేస్తుండగా ఛత్తీస్‌గఢ్‌లోని టేకమెట అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయింది. వరుసగా ఘటనలతో పట్టు కోల్పోగా, తాజాగా కమిటీలో కీలక సభ్యులు సైతం మరణించడంతో మరింత బలహీనపడనుంది.

స్థానిక పోలీసుల అప్రమత్తం

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పెన్‌గంగా, ప్రాణహిత, గోదావరి తీరాల్లో అనుమానాస్పద కదలికలపై స్థానిక పోలీసులు నిఘా పెంచారు. డ్రోన్, సీసీ కెమెరాలతో పర్యవేక్షణ, అంతర్రాష్ట్ర పోలీసుస్టేషన్ల అప్రమత్తం, ఫెర్రి పాయింట్ల భద్రత చేపట్టారు. గతంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులపై దాడులు చేసే అవకాశం ఉందనే స మాచారంతో అప్రమత్తం కాగా, తాజాగా జరుగుతున్న పరిణామాలతోనూ స్థానిక పోలీసు యంత్రాంగం పోలింగ్ ముగిసి, ఫలితాల వెల్ల డి వరకు భద్రతా కట్టుదిట్టం చేసి ప్రత్యేక బలగాలతో తనిఖీలు ముమ్మరం చేస్తున్నారు.

తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సంతోష్
- చెక్‌పోస్టుల సందర్శన



తాండూర్: చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

తాండూర్/బెల్లంపల్లిరూరల్: పార్లమెంటు ఎన్నికల దృష్ట్యా వాహనాల తనిఖీలు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం ఆయన తాండూర్ మండలం రేపల్లెవాడ శివారు, బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయ సమీపంలోని చెక్‌పోస్టులను స్థానిక అధికారులతో కలిసి సందర్శించారు. రిజిష్టర్లు తనిఖీ చేసి స్థానిక అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిమితికి మించి ఎవరైనా డబ్బులు రవాణా చేసినా, ఇంకా ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరిగినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. విధి నిర్వహణలో చిత్తశుద్ధిగా వ్యవహరించాలని సూచించారు. ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలని, వీడియో చిత్రీకరించాలని తెలిపారు. ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తరలిస్తే సీజ్ చేయాలని అన్నారు. తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ వీవీఆర్‌కేడీ ప్రసాద్, ఆర్ఐ అంజన్‌కుమార్, తహసీల్దార్ కేవై.ప్రసాద్, తాళ్లగురిజాల అదనపు ఎస్సై లింగన్న పాల్గొన్నారు.

బడి బాధ్యత మహిళలదే..

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- చైర్‌పర్సన్‌గా గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు
- కన్వీనర్‌గా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు
- ఇద్దరికి కలిపి జాయింట్ చెక్ పవర్
- ప్రతీ తరగతి నుంచి ముగ్గురు సభ్యులుగా తల్లులు



గర్మిళ్ల పాఠశాల భవనం

జిల్లాలో మహిళా సంఘాలు

జిల్లా స్వయం సహాయక మహిళా సంఘాలపై లెక్క తేల్చారు. 10,162 సంఘాలు ఉండగా 1,14,129మంది సభ్యులు ఉన్నారు. జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 510, ప్రాథమికోన్నత 96, ఉన్నత పాఠశాలలు 108, మోడల్ స్కూళ్లు 5, కేజీబీవీలు 18, ఎయిడెడ్ స్కూళ్లు 14 ఉన్నాయి.

మంచిర్యాలఅర్బన్: సర్కారు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యత మహిళ స్వయం సహాయక సంఘాలకు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరిట మహిళల పర్యవేక్షణ కొనసాగనుంది. తాగునీటి సౌకర్యాలు, మరమ్మతులు, తరగతి గదుల విద్యుద్దీకరణ, పారిశుధ్య నిర్వహణ, సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు, యూనిఫాంల కుట్టు బాధ్యతలు నిర్వహించనున్నారు. పాఠశాల యాజమాన్య కమిటీ(ఎస్ఎంసీ)ల స్థానంలో అమ్మ ఆదర్శ కమిటీలు కొలువు దీరనున్నాయి. గ్రామ మహిళా సంఘం అధ్యక్షురాలు కమిటీకి చైర్‌పర్సన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. వీరిద్దరికి జాయింట్ చెక్‌పవర్ ఇచ్చారు. ప్రతీ తరగతి నుంచి ముగ్గురు విద్యార్థుల తల్లులు సభ్యులుగా ఉంటారు.

రెండేళ్ల కాలపరిమితి

అమ్మ ఆదర్శ కమిటీలకు పాఠశాలల పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది హాజరు, ఇతర కార్యక్రమాలు సమీక్షిస్తుంటారు. కమిటీకి రెండేళ్ల కాలపరిమితి ఉంటుంది. ప్రభుత్వం నిర్దేశించిన మేర కమిటీ ఎంపిక ప్రక్రియను కొన్ని బడుల్లో ప్రారంభించారు. మహిళా సంఘం అధ్యక్షురాలు చైర్‌పర్సన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, ఒకటి నుంచి పది వరకు ప్రతీ తరగతి నుంచి విద్యార్థుల తల్లులు ముగ్గురు చొప్పున సభ్యులుగా నియమించారు. రూ.25వేల పనుల వరకు టెండర్ లేకుండా అంతకు మించి ఉంటే కమిటీలు జిల్లా సమాఖ్యల ద్వారా కలెక్టర్‌కు నివేదిస్తాయి. రూ.లక్ష దాటితే కలెక్టర్ పర్యవేక్షణలో పనులు సాగనున్నాయి. పనులు పూర్తయ్యాయని ప్రధానోపాధ్యాయుడు ధ్రువీకరిస్తేనే బిల్లులు చెల్లిస్తారు.

ఎస్ఎంసీలు లేనట్లే..

ప్రభుత్వ బడుల బలోపేతంలో కీలకమైన నిర్వహణ బాధ్యతలు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఏర్పాటుతో ఎస్ఎంఎస్‌లకు మంగళం పాడింది. జిల్లాలో 2019 నవంబర్‌లో 839 సర్కారు బడుల్లో ఎన్నికలు నిర్వహించగా 747 పాఠశాలల్లోనే ఎస్ఎంసీ ఎన్నికలు జరిగాయి. ఇందులో 92 పాఠశాలల్లో కోరం లేక వాయిదా పడ్డాయి. నాలుగేళ్ల తర్వాత ఎస్ఎంసీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఊహించారు. మరోసారి గడువు పొడిగించడం.. గతనెల 31తో ఎస్ఎంసీల పదవీ కాలం పూర్తయ్యింది. ఈ నేపథ్యంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు బడుల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది.

పేకాట స్థావరంపై దాడి

- రూ.14.48లక్షలు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన రామగుండం సీపీ



రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసులు

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామ శివారులో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేసి పది మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి భారీగా నగదు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం రామగుండం కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం సీపీ ఎం.శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. ఆస్నాద గ్రామ శివారులోని మామిడితోటలో కొందరు వ్యక్తులు రహస్యంగా పేకాడుతున్నారనే సమాచారం మేరకు రామగుండం టాస్క్‌ఫోర్స్ సీఐ సంజయ్, ఎస్సై ఉపేందర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. వారి నుంచి రూ.14.48లక్షలు, పది సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. సందెల తిరుపతి, అన్నల తిరుపతి, వరంగల్‌కు చెందిన చోటు కొంతమంది కలిసి బృందంగా ఏర్పడి మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్, ఆసిఫాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి పేకాట రాయుళ్లను పిలిపించుకుని అటవీ ప్రాంతాల్లో పేకాట స్థావరాలు ఏర్పాటు చేస్తున్నారు. కమీషన్లు వసూలు చేస్తూ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఎక్కువగా మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో స్థావరాలు ఏర్పాటు చేస్తున్నారు. చుట్టుపక్కల సెంట్రీలను ఏర్పాటు చేసుకుంటున్నారు. పేకాట స్థావరాలు ఏర్పాటు చేసే వారిపై, పేకాడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

దసిలి పట్టు.. వెరీ'గుడ్డు'

- గుడ్ల ఉత్పత్తి, కాయ దిగుబడిలో దేశంలోనే మొదటి స్థానం
- రాష్ట్రాలకు దసిలి పట్టు గుడ్లు, కాయలు ఎగుమతి
- చెన్నూర్ శాస్త్రవేత్తకు దక్కిన గౌరవం
- రీలింగ్ మిషన్ ప్రారంభానికి అధికారులు సన్నద్ధం



ఎల్లక్కపేటలో దసిలి పట్టుగుడ్ల కోసం సిద్ధం చేస్తున్న పట్టుకాయలు

చెన్నూర్: దసిలి పట్టు గుడ్ల ఉత్పత్తి, కాయ పండించడంలో మండలంలోని ఎల్లక్కపేట దేశవ్యాప్తంగా పేరుగాంచింది. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర దసిలి పట్టు పరిశ్రమ, సెంట్రల్ సిల్క్ బోర్డుల సమన్వయంతో చెన్నూర్ పట్టు గుడ్లు, కాయకు దేశవ్యాప్తంగా డిమాండ్ ఏర్పడింది. దేశ వ్యాప్తంగా 18 దసిలి పట్టు గుడ్ల ఉత్పత్తి కేంద్రాలు ఉన్నాయి. రాష్ట్రంలో మెదక్ జిల్లా నర్సాపూర్, చెన్నూర్ మండలం ఎల్లక్కపేట గ్రామంలో 1986 సెంట్రల్ సిల్క్ బోర్డు ఆధ్వర్యంలో దసిలి పట్టు గుడ్ల ఉత్పత్తి కేంద్రాలు ప్రారంభించారు. 2017లో నర్సాపూర్ కేంద్రం మూసివేశారు. ఎల్లక్కపేట పట్టు గుడ్ల ఉత్పత్తి కేంద్రంలో తొలుత ఈ ప్రాంత రైతుల అవసరాల మేరకు ఉత్పత్తి చేశారు. రైతుల డిమాండ్ మేరకు సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త ఎంవీకే భగవాన్లు గత ఐదేళ్లుగా 2.80లక్షల నుంచి 3.27 లక్షల వరకు గుడ్లు ఉత్పత్తి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన పట్టు గుడ్లు రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్, ఒడిశా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. వచ్చే ఏడాది వచ్చే ఏడాది ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి దసిలి పట్టు విత్తనాల సరఫరాకు సిద్ధమవుతునట్లు శాస్త్రవేత్తలు తెలిపారు.

పట్టు బిగించిన రైతులు

చెన్నూర్ పట్టు పరిశ్రమ పరిధిలోని రైతులు దసిలి పట్టు కాయ దిగుబడిలో ప్రథమ స్థానంలో ఉన్నారు. ఈ ప్రాంతంలో పండించిన దసిలి పట్టు కాయలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్ రాష్ట్రాలకు ఎగుమతి అవుతున్నాయి. తక్కువ పెట్టుబడితో ఏడాదికి రెండు పంటలు చేతికి వచ్చే ఏకైక పంట దసిలి పట్టు. అడవుల్లో గల నల్లమద్ది, తెల్లమద్ది చెట్లకు దసిలిపట్టు కాయలు కాస్తుండడంతో రైతులకు జీవనోపాధి లభిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతులు పట్టు గుడ్లపై 50 శాతం సబ్సిడీ అందిస్తోంది. రైతులు రెండు పంటలు చేతికి వచ్చేందుకు రూ.10 వేలు ఖర్చు అవుతుంది. రెండు పంటలకు రైతుకు రూ.80 నుంచి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది.

జిల్లాదే అగ్రస్థానం..

దేశంలో తొమ్మిది రాష్ట్రాల్లో దసిలి పంట పండిస్తున్నారు. వాతావరణ పరిస్థితులను తట్టుకొని నాణ్యమైన దసిలి పంటను పండించడంతో చెన్నూర్ ప్రాంతం అగ్రస్థానంలో నిలుస్తోంది. గతేడాది చెన్నూర్ పట్టు పరిశ్రమ పరిధిలో 38 లక్షల దసిలి పట్టు కాయలను రైతులు పండించారు. గత ఏడాది వెయ్యి కాయ ధర రూ.3810 పలికింది. ఈసారి వచ్చే కాయకు రూ.4 వేలు పలుకుతుందని అధికారులు అంటున్నారు.

త్వరలో రీలింగ్ మిషన్ ప్రారంభం..

రైతులు పండించిన దసిలి పట్టుకాయల ద్వారా తీసేందుకు చెన్నూర్ పట్టు పరిశ్రమ ఆధ్వర్యంలో రీలింగ్ మిషన్ ఏర్పాటు కోసం ప్రభుత్వం నుంచి రూ.20 లక్షలు మంజూరయ్యాయి. త్వరలోనే చెన్నూర్‌లో రీలింగ్ మిషన్ ప్రారంభానికి అధికారులు సన్నద్ధం అవుతున్నారు. రీలింగ్ మిషన్ ఏర్పాటు చేస్తే మరికొంత మందికి ఉపాధి లభించడంతోపాటు దారం తయారు చేసి ఎక్కువ ధరకు విక్రయించే అవకాశం ఉంటుంది. కాయకు మరింత డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుంది.

శాస్త్రవేత్తకు భగవాన్లకు దక్కిన గౌరవం



అవార్డు అందుకుంటున్న చెన్నూర్ సెంట్రల్ సిల్క్ బోర్డు శాస్త్రవేత్త భగవాన్లు

ఎల్లక్కపేటలో తయారు చేస్తున్న దసిలి పట్టు గుడ్లు(విత్తనాలు)ను దేశం మెచ్చింది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే గుడ్లకు దేశ వ్యాప్తంగా డిమాండ్ పలుకుతోంది. నాణ్యమైన దసిలి పట్టు గుడ్ల ఉత్పత్తిలో కీలక భూమికి పోషిస్తున్న శాస్త్రవేత్త భగవాన్లుకు జాతీయ స్థాయిలో గౌరవం దక్కింది. ఈ ఏడాది జనవరి 30, 31వ తేదీల్లో బెంగళూరులో జరిగిన అంతర్జాతీయ సదస్సులో సెంట్రల్ సిల్క్ బోర్డు జాతీయ సభ్యుల చేతుల మీదుగా ప్రశంసపత్రం, ఉత్తమ శాస్త్రవేత్త అవార్డు అందుకున్నారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు విద్యార్థుల ఎంపిక

మంచిర్యాలఅగ్రికల్చర్: 2024-25 విద్యా సంవత్సరానికి జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ ద్వారా హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 1వ తరగతిలో ప్రవేశానికి విద్యార్థులను ఎంపిక చేసినట్లు జిల్లా అదనపు కలెక్టర్ మోతిలాల్ తెలిపారు. మంగళవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి గంగారాంతో కలిసి డ్రా పద్ధతిన విద్యార్థులను ఎంపిక చేశామని తెలిపారు. 1వ తరగతిలో ప్రవేశాలకు జిల్లా నుంచి ఐదుగురిని ఎంపిక చేయగా.. వీరిలో గోండ్/నాయక్‌పోడ్‌కు చెందిన ఇద్దరు, లంబాడా, కొలాం, ఇతర ఉప గిరిజనులలో ఒకరి చొప్పున ఉన్నారని తెలిపారు.

నిబంధనలు అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జైపూర్ ఏసీపీ

చెన్నూర్: పార్లమెంటు ఎన్నికలు నిబంధనలు అమలు చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక తహసీల్ కార్యాలయంలో ఆర్వో చంద్రకళ అధ్యక్షతన సెక్టోరల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఏసీపీ మాట్లాడుతూ మున్సిపాలిటీలతోపాటు మండల కేంద్రాల్లో ఫ్లెక్సీలు తొలగించాలని తెలిపారు. అనంతరం కోటపల్లి, సుందిళ్ల చెక్‌పోస్టులను పరిశీలించారు. తహసీల్దార్లు చంద్రశేఖర్, వనజారెడ్డి, సదానందం, సీఐలు రవీందర్, సుధాకర్, డీటీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కాసిపేట: మండలంలోని గట్రావుపల్లి, ధర్మరావుపేట, వెంకటపూర్, సోనాపూర్, దేవాపూర్ మారుమూల, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ మంగళవారం పరిశీలించారు. మల్కేపల్లి ఆశ్రమ పాఠశాల పదవ తరగతి పరీక్ష కేంద్రం సందర్శించారు. దేవాపూర్ ఎస్ఐ ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధారాలు ఉండాలి

దండేపల్లి: నగదు తీసుకెళ్లే వారు ఆధారాలు వెంట ఉంచుకోవాలని మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ సూచించారు. దండేపల్లి మండలం గూడెం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలను మంగళవారం పరిశీలించారు.

క్లుప్తంగా

యువకుడిపై పలువురి దాడి

జన్నారం: మండలంలోని పొనకల్ పంచాయతీ పరిధి గాంధీనగర్‌కు చెందిన మారిపాక అంజన్నపై పలువురు విచక్షణా రహితంగా దాడిచేసి గాయపరిచారు. ఎస్సై రాజవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్‌కు చెందిన అంజన్నను పాత కక్షలు దృష్టిలో పెట్టుకుని కొందరు సోమవారం రాత్రి బస్టాండ్ వెనుకగల ఖాళీ స్థలంలోకి తీసుకెళ్లారు. అక్కడ గాంధీనగర్‌కు చెందిన పలువురు వీరిపై కర్రలతో దాడికి పాల్పడ్డారు. తీవ్ర గాయాలతో కేకలు వేయగా, వారు పారిపోయారు. గమనించిన స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకుని ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు జిత్తు, రాజు, ఓంకార్‌తోపాటు మరికొందరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

నగదు స్వాధీనం



ప్రత్యేకాధికారికి నగదు ఇస్తున్న ఎస్సై

సిర్పూర్(టి): మండలకేంద్రంలో మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. మంచిర్యాల జిల్లా చెన్నూర్‌కు చెందిన నజీర్‌ఖాన్ ఎలాంటి ఆధారం లేకుండా తరలిస్తున్న రూ.85వేల నగదు పట్టుకుని సీజ్ చేశారు. ఈ నగదును నజీర్ ఖాన్ మహారాష్ట్రలోని పాండ్రకోవుడా గ్రామానికి తరలిస్తున్నట్లు తెలిసింది. పట్టుకున్న నగదు సీజ్ చేసి ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బందికి అప్పగించినట్లు ఎస్సై రమేశ్ తెలిపారు.

పోక్సో కేసులో ఒకరికి జీవితఖైదు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని భట్‌పల్లి గ్రామపంచాయతీ పరిధి సీ బాబుకాలనీలో ఓ మైనర్ బాలికపై దురుసుగా ప్రవర్తించిన పైలి రమేశ్‌కు సెషన్స్‌కోర్టు జిల్లా జడ్జి ఎంవీ రమేశ్ జీవితకాలం కఠిన కారాగార జైలుశిక్ష, రూ.10 వేల జరిమానా విధించినట్లు ఎస్సై సోనియా తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. రమేశ్ గతేడాది మే నెలలో ఏడేళ్ల బాలికపై దురుసుగా ప్రవర్తించాడు. బాలిక బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జడ్జి పైవిధంగా తీర్పు చెప్పారు. ఈకేసులో అత్యంత తొందరగా సాక్ష్యాలను ప్రవేశపెట్టిన పీపీ జీవీ ప్రసాద్, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్, డీఎస్పీ కరుణాకర్, లైజనింగ్ ఆఫీసర్ సాగర్, సీడీవో బాబాజీని ఎస్పీ సురేశ్‌కుమార్ అభినందించినట్లు ఎస్సై తెలిపారు.

గురుకుల ప్రిన్సిపాల్‌పై చర్యలు చేపట్టాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: విద్యార్థిని మృతికి కారణమైన జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. అదనపు కలెక్టర్‌ను కలిసినవారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మిట్టపల్లి తిరుపతి, జిల్లా కమిటీ సభ్యుడు అభినవ్ తదితరులున్నారు.

కుడుక అను'బంధం'



కిరాణా షాపులో కుడుకలు కొనుగోలు చేస్తున్న ఆదివాసీ గిరిజన మహిళ

- హోలీకి ముస్తాబవుతున్న ఆదివాసీగూడేలు
- ఎక్కడున్నా పండక్కి ఊరికి రావాల్సిందే..
- వేడుకలకు సిద్ధమవుతున్న గిరిజనులు
- కుడుక ఇచ్చిన కుటుంబాలే లెక్కలోకి..



చక్కెర బిళ్లలు కొనుగోలు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా ఆదివాసీ గ్రామాల్లో హోలీ వేడుకలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో హోలీ (దురాడి) పండుగ అత్యంత పవిత్రంగా... భిన్నంగా నిర్వహిస్తారు. గ్రామస్తులు ఊళ్లో ఉండాలంటే కాముడి దహనం రోజు గ్రామ పెద్దలకు కుడుక ఇవ్వాల్సిందే. అలా ఇస్తేనే ఆ కుటుంబం గ్రామ జాబితాలో ఉంటుంది. కుడుక ఇవ్వనివారితో గ్రామస్తులకు ఎలాంటి సంబంధం ఉండదు. ఆ ఇంట్లో ఏ శుభకార్యం జరిగినా ఊళ్లో వాళ్లు వెళ్లరు. అందుకే బతుకుదెరువు కోసం వేరే ప్రాంతానికి వెళ్లినా ఉద్యోగ, రాజకీయ రీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారుకూడా హోలీకి తప్పకుండా స్వగ్రామానికి వస్తారు. తరాలుగా వస్తున్న ఆచారాన్ని ఆదివాసీలు నేటికీ పాటిస్తున్నారు.

దురాడీ కొౖబ్రేతో కుటుంబాల లెక్క

కుడుకను ఆదివాసీల భాషలో దురాడీ కొౖబ్రే (హోలీ కుడక) అని పిలుస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీ గ్రామాల్లో ఈ పండుగ ఘనంగా నిర్వహిస్తారు. హోలీకి ఒకరోజు ముందు గ్రామ పెద్ద పటేల్ ఇంట్లో కూర్చొని తమ గ్రామంలో ఎన్ని కొత్త కుటుంబాలు చేరాయి. ఎన్ని కుటుంబాలు ఊరు వదిలి వెళ్లాయనేది కాముడి దహనం రోజు గ్రామస్తులు ఇచ్చిన కుడుకల ఆధారంగా లెక్కచూస్తారు. కొత్తగా కాపురాలు పెట్టిన వారుకూడా ఈ రోజే గ్రామ జాబితాలో చేరడానికి అవకాశం ఉంటుంది.

బూడిదకు అత్యంత ప్రాధాన్యం

ఆదివాసీ సంప్రదాయం ప్రకారం కాముడి దహనం చేసిన బూడిదను ఇండ్ల ముఖద్వారాల వద్ద గీతగా వేస్తారు. ఇలా వేస్తే ఎలాంటి దుష్టశక్తులు ఇంట్లోకి రావని ఆదివాసీల నమ్మకం. అంతేకాకుండా ఆదివాసీ గ్రామాల్లో అతి పవిత్రంగా నిర్వహించే దండారీ ఉత్సవాల్లో కాముడి దహనం బూడిదకు అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. గుస్సాడీల వేషధారణకు ఈ బూడిదనే ఉపయోగిస్తారు.

కాముడి దహనం...

హోలీకి ఒకరోజు ముందు కుడుకలు సేకరించిన అనంతరం అటవీప్రాంతం నుంచి మాతారి, మాత్రాల్ (వృద్ధురాలు..వృద్ధుడు) పేర్లతో తీసుకొచ్చిన రెండు వెదురు బొంగులకు ఇళ్ల నుంచి సేకరించిన కుడుక ముక్కలు, చక్కెర బిళ్లల హారాలు, ఉల్లిమొక్కలు, నైవేద్యం, మోదుగపూలతో పేర్చి గ్రామ పొలిమేరలో సంప్రదాయ వాయిద్యాల మధ్య కాముడిదహనం చేస్తారు. ఆ స్థలంలో రాత్రంతా జాగారం ఉంటారు. జాజిరిరూపంలో ఇళ్ల నుంచి సేకరించిన నవధాన్యాలతో గుడాలు వండడంతో పాటు ఆ రోజు దొంగిలించి తెచ్చిన కోళ్లు, మేకపోతులను ఆస్థలంలో బలిస్తారు. ఇది అనాదిగా వస్తున్న ఆచారం. మరుసటి రోజు బావ బావమరుదులు, చిన్నాపెద్ద తేడాలేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉల్లాసంగా గడుపుతారు. సంప్రదాయ వాయిద్యాలు వాయిస్తూ నృత్యం చేస్తారు.

పకడ్బందీగా కుడుకల సేకరణ



ఆదివాసీ గ్రామాల్లో హోలీ ఘనంగా నిర్వహిస్తాం. కాముడి దహనం రోజు గ్రామ పెద్ద ఇంట్లో పెద్దల సమక్షంలో కుడుక సేకరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తాం. సేకరించిన కుడుకల ఆధారంగా గ్రామంలో నివాసం ఉంటున్న కుటుంబాల లెక్క చూస్తాం. ఈ ఆచార వ్యవహారాలను పాటిస్తూ భావితరాలకు అందిస్తున్నాం.

– వెట్టి రాజేశ్వర్, పిట్టబొంగరం గ్రామ పటేల్

'సస్పెన్షన్ ఎత్తివేయాలి'



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్: మందమర్రి ఏరియా స్టోర్స్‌లో ఈఈగా పని చేస్తున్న శశిధర్‌పై జారీ చేసిన సస్పెన్షన్ ఎత్తివేయాలని సింగరేణి అధికారుల సంఘం (సీఎంవోఏఐ) నాయకులు యాజమాన్యాన్ని కోరా రు. ఈ మేరకు వారు సీఎండీని మంగళవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డితో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఓ ప్రమాదానికి కారణంగా చూపుతూ అతడిపై చర్యలు తీసుకోవడం సరికాదన్నారు. జరిగిన ప్రమాదంపై విచారణ జరుగుతున్న సమయంలో పూర్తి వాస్తవాలు వెలుగుచూడక ముందే అధికారి మనోస్థైర్యం దెబ్బతినేలా చర్యలు తీసుకోవడం సరి కాదన్నారు. విచారణ పూర్తికాక ముందే చర్యలు తీసుకోవడం సరికాదని పేర్కొన్నారు. కంపెనీ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో ప్రతీ అధికారి ఎంతో శ్రమిస్తున్నారని, ఇలాంటి చర్యలతో మనోవేదనకు గురవుతున్నామని పేర్కొన్నారు. శశిధర్‌పై సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని సీఎండీ దృష్టికి తీసుకువెళ్లాలని జీఎంను కోరారు. కార్యక్రమంలో అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సెక్రటరీ చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు మహేశ్, కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీలు ఎండీ గౌస్, ట్రెజరర్ కోటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

'గుర్తింపు' పత్రం ఇవ్వాలి



కార్మికులతో మాట్లాడుతున్న రంగయ్య

శ్రీరాంపూర్: గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి మూడు నెలలైనా గెలిచిన తమ సంఘానికి యజమాన్యం గుర్తింపుపత్రం ఇవ్వలేదని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిర్యాల రంగయ్య తెలిపారు. మంగళవారం ఆయన ఆర్కే 6గనిపై కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. యజమాన్యం జాప్యం చేయడంతో విధిగా జరగాల్సిన స్ట్రక్చరల్ సమావేశాలు, ఇతర సమావేశాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. వెంటనే గుర్తింపు పత్రం అందజేయాలని, జాప్యం అవుతున్నప్పటికీ కార్మికుల సమస్యలు ఎప్పటికప్పుడు యాజమాన్యంతో చర్చిస్తూ పరిష్కరిస్తున్నామన్నారు. కొత్త గనుల ఏర్పాటుకు ప్రభుత్వం, యాజమాన్యంతో కూడా సంప్రదింపులు చేస్తున్నామని పేర్కొన్నారు. అండర్ గ్రౌండ్ అన్‌ఫిట్ అయిన మైనింగ్ స్టాఫ్‌కు సర్ఫేస్‌లో సూటబుల్ జాబ్ కల్పిస్తున్నామని తెలిపారు. ఉద్యోగి ప్రమాదవశాత్తు చనిపోతే అతడి కుటుంబానికి రూ.కోటి బీమా సౌకర్యం కూడా కల్పించినట్లు చెప్పారు. కంపెనీలోని ఖాళీ పోస్టులను అంతర్గత ఉద్యోగులతో భర్తీ చేయించేలా యాజమాన్యాన్ని ఒప్పించామని వివరించారు. యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంఘం సదానందం, నాయకులు అఫ్రోజ్‌ఖాన్, నాయకులు లక్ష్మణ్, రామచందర్, నగేశ్, సంపత్‌కుమార్, రాజేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పాతమంచిర్యాల: తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ, ట్రైబల్ వెల్ఫేర్ గురుకులాల విద్యాలయాల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 6,7,8,9 తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లు భర్తీ చేయడానికి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సోషల్ వెల్ఫేర్ గురుకుల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజినల్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి ఓ ప్రకటనలో తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అల్గునూర్ (కరీంనగర్), గౌలిదొడ్డి (రంగారెడ్డి)లోని పాఠశాలల్లో తొమ్మిదో తరగతిలో రెగ్యులర్ అడ్మిషన్ల ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలని, స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పరిగి వికారాబాద్ జిల్లాలో బాలికలు, ఖమ్మం బాలికల విద్యాలయాల్లో 8వ తరగతిలో రెగ్యులర్ ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సీట్ల ఖాళీల వివరాలకు www. tswreis. ac. in ను సంప్రదించి ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రవేశపరీక్ష ఏప్రిల్ 21వ తేదీ ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

స్టోర్స్‌లో కార్మికుడి మృతిపై విచారణ



జీఎంకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మందమర్రిరూరల్: ఈ నెల 16వ తేదీన మందమర్రి ఏరియాలోని స్టోర్స్‌లో జరిగిన ప్రమాదంలో కాసిపేట–2 గని కార్మికుడు కర్రె రాజు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవాలని గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలు ఆందోళన చేశాయి. స్పందించిన యాజమాన్యం విచారణలో భాగంగా.. స్టోర్స్‌లో విధులను నిర్లక్ష్యం చేసినవారిని గుర్తించింది. స్టోర్స్ ఎస్ఈ షైడేశ్వర్‌కు చార్జిషీట్, ఈఈ శశిధర్, సూపర్‌వైజర్ సత్యనారాయణను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రమాదం జరిగిన రోజు ఉదయం రాజుతో పాటు మరో ఐదుగురు కార్మికులు కాసిపేట–2 గని నుంచి రోప్‌తో పాటు డబ్ల్యూ స్టాప్ ఐరన్ ప్లేట్లు తీసుకెళ్లడానికి ఆ గని నుంచే అప్పటికే మూడుచోట్ల తెగిపడగా ముడి వేసి ఉన్న స్లింగ్ (డబ్ల్యూస్టాప్ ఐరన్ ప్లేట్స్‌కు కట్టి ఎస్కార్ట్‌కు తగిలించిన తాడు) వెంట తెచ్చుకున్నారు. దాని ద్వారానే డబ్ల్యూ స్టాప్ ఐరన్ ప్లేట్లు ఎత్తి లారీలోకి లోడు చేస్తుండగా స్లింగ్ తెగడంతో డబ్ల్యూ స్టాప్ ఐరన్ ప్లేట్లు రాజు పొట్ట కింది భాగంపై పడడంతో మృతి చెందాడు. కాగా, విచారణలో భాగంగా కార్మికుడి మృతికి బాధ్యులను చేస్తూ యాజమాన్యం అధికారులకు చార్జిషీట్, సస్పెన్షన్ చేయడం అన్యాయమని సీఎంవోఏఐ మందమర్రి ఏరియా అధ్యక్షుడు రమేశ్ నాయకులతో కలిసి మంగళవారం ఏరియా జీఎం మనోహర్‌కు వినతిపత్రం ఇచ్చారు. విచారణ పూర్తయ్యే దాకా అధికారుల చార్జిషీట్, సస్పెన్షన్ ఎత్తి వేయాలని డిమాండ్ చేశారు.

చెక్‌పోస్ట్ వద్ద రూ.2.70లక్షలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో సీఐ, పోలీసులు

కాసిపేట: కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి చొప్పరిపల్లి సమీపంలో జాతీయ రహదారిపై పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద మంగళవారం సాయంత్రం మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. రూ.2.70 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. మంచిర్యాల అమ్మ గార్డెన్స్‌కు చెందిన ఇప్పనపల్లి శ్రీధర్ రూ.1.50లక్షలు, ఆసిఫాబాద్‌కు చెందిన చౌదరి సోమయ్య రూ.1.20లక్షలు రూపాయలు ఎలాంటి ఆధారాలు లేకుండా తరలిస్తుండగా ఎస్ఎస్టీ సిబ్బందితో కలిసి పట్టుకున్నట్లు తెలిపారు. ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి నగదు తరలించవద్దని సూచించారు. కాసిపేట ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గోలేటి సీహెచ్‌పీ వద్ద..

రెబ్బెన: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని గోలేటి సీహెచ్‌పీ వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ సమీపంలో మంగళవారం పోలీసుల తనిఖీల్లో రూ.59,800 నగదు లభ్యమైంది. వివరాలు.. సిర్పూర్ నుంచి మంచిర్యాల వైపు వెళ్తున్న కారును గోలేటి సీహెచ్‌పీ వద్ద పోలీస్ సిబ్బంది తనిఖీ చేశారు. కారులో రూ.59,800 నగదు లభ్యమైంది. పట్టుబడిన నగదుకు సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవటంతో సీజ్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

పెట్రోల్ పంపుల్లో ఉద్యోగావకాశాలు

మంచిర్యాలఅగ్రికల్చర్: పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే పెట్రోల్ పంపుల్లో ఉద్యోగావకాశాలున్నట్లు రామగుండం సీపీ శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్ పక్కన పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ కంపెనీ పెట్రోల్ పంపులో పెట్రోల్ ఫిల్లింగ్–15, ఎయిర్ ఫిల్లింగ్–2, స్కావెంజర్స్–1 ఉద్యోగాలున్నట్లు పేర్కొన్నారు. మంచిర్యాల జిల్లావాసులూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పెట్రోల్ ఫిల్లింగ్‌కు 15మంది పురుష, మహిళా అభ్యర్థులకు ఇంటర్మీడియట్ విద్యార్హత, 35 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని, మూడు షిఫ్టుల చొప్పున 8 గంటల పనిసమయం ఉంటుందని, వేతనం రూ.10 వేలు ఉంటుందని తెలిపారు. ఎయిర్ నింపేందుకుకు ఇద్దరు అవసరమని, పదో తరగతి విద్యార్హత ఉండి 35 ఏళ్లు కలిగినవారికి వేతనం రూ.7వేలు ఉంటుందని పేర్కొన్నారు. స్కావెంజర్లు–1, 8వ తరగతి వేతనం రూ.7వేలు ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు ఏఆర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌ను 96522 25673 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నాలుగు వాహనాలు ఢీ



ధ్వంసమైన వాహనం

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాలుగు వాహనాలు ఒకదానికొకటి ఢీకొనగా పలువురికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల నుంచి లక్సెట్టిపేట వైపు వెళ్తున్న టాటా ఇంట్రా ట్రాలీ లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపునకు వస్తున్న టాటా ఏస్ వాహనాలు ఎదురెదురుగా ఢీకొనగా ఇదే సమయంలో లక్సెట్టిపేట నుంచి మంచిర్యాల వైపు వస్తున్న మరో టాటా ఏస్‌తో పాటు ఓ ఆటో వెనుక నుంచి ఢీకొన్నాయి. కోటపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి ముల్ల శేఖర్ కుటుంబసభ్యులతో పాటు వేమనపల్లి మండలానికి చెందిన రెండు టాటా ఏస్ వాహనాల్లో మూడు కుటుంబాలకు చెందిన 16 మంది కొండగట్టు దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. టాటా ఇంట్రా వాహనం డ్రైవర్ బాకం రవి కాలుకు, భుజానికి గాయాలు కాగా, అందరికీ తృటిలో ప్రమాదం తప్పింది. మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరా తీశారు. క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

మద్యానికి బానిసై ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

వాంకిడి(ఆసిఫాబాద్): మద్యానికి బానిసై ఒకరు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై సాగర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఖమాన గ్రామానికి చెందిన టిప్లె శంకర్ (42) కొన్నేళ్లుగా కడుపు నొప్పితో బాధ పడుతున్నాడు. ఈక్రమంలో కడుపులో నొప్పి వచ్చినప్పుడల్లా మద్యం తాగేవాడు. దీంతో మద్యానికి బానిసయ్యాడు. భార్య సునీత, కుమారులు సాయి, శ్రీనివాస్ దవాఖానకు వెళ్దామంటే పట్టించుకునే వాడు కాదు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మద్యం తాగి ఇంటికి రాగా భార్య, పిల్లలు తాగుడు మానాలని మందలించారు. దీంతో 7 గంటల సమయంలో ఇంట్లోంచి బయటికి వెళ్లిన శంకర్ తిరిగి రాలేదు. రాత్రి గ్రామంలో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. మంగళవారం ఉదయాన్నే చిన్న కొడుకు శ్రీనివాస్ చేను వద్దకు వెళ్లి చూడగా పంట చేనులోనే విగతజీవిగా పడి ఉన్నాడు. పక్కన పురుగుల మందు డబ్బా కనిపించగా ఆత్మహత్య చేసుకుని ఉంటాడని గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించారు. మృతుడి పెద్ద కొడుకు సాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కిలో గంజాయి పట్టివేత

వాంకిడి(ఆసిఫాబాద్): గంజాయి తరలిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడి పట్టుబడ్డ గంజాయి వివరాలు వెల్లడించారు. మంచిర్యాల జిల్లా మందమర్రికి చెందిన కోట మహేశ్ మహారాష్ట్రలోని చంద్రపూర్ జిల్లాకు చెందిన దిలీప్ యాదవ్‌కు రూ.10 వేలు చెల్లించి కిలో గంజాయి కొనుగోలు చేశాడు. దీనిని బ్యాగులో పెట్టుకుని సోమవారం రాత్రి వాంకిడికి వచ్చిన మహేశ్ బస్టాండ్‌లో అనుమానాస్పదంగా కనిపించాడు. పోలీసులు తనిఖీ చేయగా బ్యాగులో కిలో గంజాయి లభించింది. మహేశ్‌ను అదుపులోకి తీసుకుని గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ శ్రీనివాస్, ఎస్సై సాగర్ తెలిపారు.

చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: రేషన్‌బియ్యం తరలింపులో అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మంగళవారం అదనపు కలెక్టర్ మోతీలాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. మిల్లర్లతో కుమ్మక్కై అక్రమాలకు పాల్పడ్డారని, చర్యలు తీసుకోవాలని కోరారు.

బస్సు ఢీకొని విద్యార్థినికి గాయాలు



ఆస్మితను ఆస్పత్రికి తరలిస్తున్న స్థానికులు

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో మంగళవారం చెన్నూర్‌ప్లాట్‌ఫాం వద్ద బస్సు ఢీకొన్న ప్రమాదంలో విద్యార్థినికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కాగజ్‌నగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని ఆస్మిత మంచిర్యాలకు తన కుటుంబసభ్యులతో వచ్చింది. పనులు ముగించుకుని తిరుగు ప్రయాణంలో ఆటో ఎక్కి బస్‌స్టేషన్‌లో దిగింది. అక్కడి నుంచి నడుచుకుంటూ వెళ్లే క్రమంలో చెన్నూర్ ప్లాట్‌ఫాం వద్ద బస్సు ఢీకొంది. టైరు మధ్య ఆస్మిత పాదం చిక్కుకుని నుజ్జునుజ్జయింది. స్థానికులు, కుటుంబసభ్యులు వెంటనే రక్తస్రావమైన ఆస్మితను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే వివరాలు తెలియాల్సి ఉంది.

ఏడు నెలలైనా అందని సీఎంపీఎఫ్ రుణాలు



సీఎంపీఎఫ్ కార్యాలయం

శ్రీరాంపూర్: సింగరేణిలో ఉద్యోగులకు సీఎంపీఎఫ్ రుణాలు అందడంలేదు. పిల్లల చదువులు, వివాహాలు, ఇంటి నిర్మాణానికి పలువురు రుణాల కోసం దరఖాస్తు చేసుకుని, అడిగిన ధ్రువీకరణ పత్రాలు అందించారు. కానీ.. ఏడునెలలైనా రుణాలు మంజూరు కాలేదు. కాగా, దరఖాస్తు ప్రక్రియలో మార్పులు, చేర్పుల కారణంగానే జాప్యం జరుగుతున్నట్లు సమాచారం. ఏరియాల నుంచి ఫైళ్లు నేరుగా సీఎంపీఎఫ్ కార్యాలయానికి కాకుండా కార్పొరేట్‌కు పంపి అక్కడి ఉన్నతాధికారుల ఆమోదం పొందితేనే రుణాలు ఇవ్వనున్నట్లు అధికారులు కొత్త నిబంధన పెట్టడమే ఇందుకు కారణం. అయినప్పటికీ అధికారులు ప్రక్రియ పూర్తి చేసే ఏర్పాట్లు చేస్తున్నారు. కంపెనీ అధికారులు సీఎంపీఎఫ్ అధికారులతో చర్చించి త్వరగా సెటిల్‌మెంట్ చేసేందుకు ఆ శాఖకు క్లెయిం ఫైల్స్ పంపుతున్నారు. త్వరలో రుణాలు మంజూరవుతాయని అధికారులు తెలిపారు.

మామిడిలో యాజమాన్య పద్ధతులు



చెన్నూర్‌రూరల్: వేసవిలో మామిడి తోటల రక్షణకు చర్యలు చేపట్టాలని ఉద్యానవనశాఖ అధికారి తిరుపతి ఓ ప్రకటనలో సూచించారు. ఉష్ణోగ్రతలు పెరిగి, గాలిలో తేమ తగ్గి కాయలపై పొడలు ఏర్పడి పెరుగుదల తగ్గుతుందని తెలిపారు. దీంతో నాణ్యత తోపాటు దిగుబడి తగ్గి మార్కెట్‌లో సరైన ధర లభించక నష్టపోయే ప్రమాదముందని వివరించారు. ఎండలు పెరిగే కొద్ది కాయల పెరుగుదల లోపిస్తుందని, నాణ్యత తగ్గుతుందని పేర్కొన్నారు. చాలా సందర్భాల్లో 20 నుంచి 30శాతం వరకు కాయలు ఎండ తీవ్రతతోనే దెబ్బ తింటాయని తెలిపారు. ఇందులో బంగినపల్లి, నీలం, తోతాపరి తదితర రకాల కాయలకు ఎండ బెడద ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో కాయ కుళ్లి చాలావరకు రాలిపోతాయని వివరించారు. 20 ఏళ్ల లోపు వయస్సున్న తోటలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. నివారణకు పిందెలు గోలి సైజులో ఉన్నప్పుడు ఒకసారి, నిమ్మకాయ సైజులో ఉన్నప్పుడు రెండోసారి లీటర్ నీటిలో 20 గ్రాముల సున్నం, అర మిల్లీ లీటర్ జిగురు కలిపిన ద్రావణాన్ని పిందెలు, కాయలపై సన్నటి పొర ఏర్పడేలా పిచికారి చేయాలని సూచించారు. కాయలు పసుపు రంగులోకి మారి రాలకుండా మూడు గ్రాముల బోరాన్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలని తెలిపారు. కాయల తొడిమ వద్ద (మంగు) నల్లగా ఏర్పడితే వెంటనే ఇమిడాక్లోప్రిడ్, లామ్డాసైహాలోత్రిన్ లేదా ఇమిడాక్లోప్రిడ్, ఫిప్రోనిల్ మందులు పిచికారి చేయాలని పేర్కొన్నారు. అవసరమైతే ఉద్యానవనశాఖ అధికారులను సంప్రదించి నివారణ చర్యల గురించి తెలుసుకోవాలని సూచించారు.